సాక్షి ఆదిలాబాద్

మంగళవారం : 16 : మే : 2023



'గ్రీవెన్స్'లో రైతు హల్‌చల్

గ్రీవెన్స్‌లో ఓ రైతు అసహనంతో అర్జీని అధికారులపైకి విసిరి హల్‌చల్ చేశాడు. తన భూమిని తహసీల్దార్ ఇతరులకు పట్టా చేసి ఇచ్చారని ఆరోపించాడు. 10లో▸



నేటి నుంచి 'దోస్త్'

డిగ్రీలో ప్రవేశాలకు వేళయింది. నేటి నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈనెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు మొదలుకానున్నాయి. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.0/28.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు పాలిసెట్

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఈనెల 17న పాలిసెట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడేళ్ల ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్, డిప్లొమాలో ప్రవేశం కోసం పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగనుంది. జిల్లా కేంద్రంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ్ తెలిపారు. పరీక్షకు 1200 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులను కేంద్రంలోనికి గంట ముందుగానే అనుమతించనున్నట్లు తెలిపారు. నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ అని స్పష్టం చేశారు.

చివరి గింజ వరకు కొనుగోలు



రైతును సన్మానిస్తున్న భోజారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రైతులు పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. తలమడుగు మండలానికి చెందిన తొలి విక్రయ రైతు నల్ల పద్మారెడ్డిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు రైతుల కష్టాలు తెలుసన్నారు. అందుకే అన్నదాతల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. మక్కలను క్వింటాలుకు రూ.1,962తో కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, వైస్ చైర్మన్ రమేశ్, ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ రమేష్, పీఏసీఎస్ ఆదిలాబాద్ చైర్మన్ పరమేశ్వర్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత చిత్ర ప్రదర్శన



విద్యార్థినులు, యువతులతో కలిసి చిత్రాన్ని వీక్షిస్తున్న పాయల్‌శంకర్

ఆదిలాబాద్: ది కేరళ స్టోరీ చిత్రాన్ని ప్రతీ యువతి, విద్యార్థిని చూడాల్సిన అవసరం ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. విద్యార్థినులు, యువతుల కోసం జిల్లా కేంద్రంలోని నటరాజ్ థియేటర్‌లో సోమవారం ఈ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు.హిందూ యువతులపై జరుగుతున్న అరాచకాల విషయంలో ప్రజలను జాగృతం చేయాలనే ఉద్దేశంతోనే బీజేపీ ఆధ్వర్యంలో చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, దినేశ్ మటోలియా, ప్రవీణ్, వేద వ్యాస్, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పత్తి విత్తనాల సరఫరా అరికట్టాలి

ఎదులాపురం: నిషేధిత పత్తి విత్తనాల సరఫరా అరికట్టాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రధాన పంటగా దాదాపు 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందన్నారు. అయితే కొంతమంది అక్రమార్కులు పక్క రాష్ట్రాల నుంచి నిషేధిత పత్తి, గడ్డి విత్తనాలను తీసుకువచ్చి రైతులకు అంటగడుతున్నారన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుతో పాటు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు వినోద్ కుమార్, అశోక్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం

సీడీపీవో మిల్కా

హైడ్రామా..!

- ఉపాధి కల్పన శాఖాధికారి నియామకంలో..
- ఇన్‌చార్జి ఆఫీసర్ వెంకటరమణను తొలగింపు
- సీడీపీవో మిల్కాకు బాధ్యతలు అప్పగించే అవకాశం
- ఆ శాఖ కమిషనరేట్ నుంచి ఆమోదం రావడమే తరువాయి

సాక్షి, ఆదిలాబాద్: ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో కొద్ది రోజులుగా హైడ్రామా సాగుతోంది. రెండు నెలలుగా ఇన్‌చార్జి అధికారిగా కొనసాగుతున్న మంచిర్యాల ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్‌ను జిల్లా కలెక్టర్ తొలగించారు. ఆయన స్థానంలో సీడీపీవో మిల్కాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం ఉంది. మాతృశాఖ మహిళా శిశు సంక్షేమ నుంచి మరో శాఖ ఉపాధి కల్పన శాఖ (ఫారెన్ సర్వీస్) కావడంతో సంబంధిత శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి ఆమోదం తప్పనిసరి. దీంతో జిల్లా యంత్రాంగం నుంచి ఆమె సర్వీసును వినియోగించుకునే విషయంలో ఆమోదం కోసం సంబంధిత ఉపాధి శిక్షణ కమిషనరేట్ కార్యాలయానికి నివేదించారు. ఆ ఆమోదం రావడమే తరువాయి.

డీడబ్ల్యూవోగా కొనసాగుతూ..

మహిళా శిశు సంక్షేమ శాఖలో సీడీపీవో హోదాలో ఉన్న మిల్కా కొన్నేళ్లుగా జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూవో)గా కొనసాగారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆ శాఖలో ఏడీ స్థాయిలో ఉన్న పలువురు అధికారులకు డీడీలుగా పదోన్నతి కల్పించి జిల్లా స్థాయిలో డీడబ్ల్యూవోగా నియమించారు. ఆదిలాబాద్ జిల్లాకు సుభద్రను నియమించగా ఆమె ఇటీవల చార్జ్ తీసుకుని అదే రోజు సెలవు పెట్టి వెళ్లిపోయారు. అయితే ఈ శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి సీనియర్ సీడీపీఓకు ఇన్‌చార్జి డీడబ్ల్యూవోగా నియమించే విషయంలో పరిశీలన చేస్తున్నారు. మరో పక్క మిల్కాకు జిల్లాలో సీడీపీవో పోస్టు కూడా లేదు. అంతే కాకుండా ఆమె కంటే సీనియర్ అయిన ఆదిలాబాద్ అర్బన్ సీడీపీవో వనజకు ఆ హోదా కట్టబెట్టే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. ఇన్ని రోజుల పాటు జిల్లా స్థాయి అధికారి ఇన్‌చార్జి హోదాలో కొనసాగిన మిల్కా మరో ఉన్నత పోస్టు కోసం రాజకీయ పైరవీల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఎంప్లాయ్‌మెంట్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటం, ఇన్‌చార్జిగా పక్క జిల్లా అధికారి కొనసాగుతుండగా ఆ పోస్టు పై ఆమె దృష్టి సారించింది.

అందుబాటులో లేకపోవడంతో..

జిల్లా ఉపాధి కల్పన శాఖ ఇన్‌చార్జి అధికారిగా రెండు నెలలుగా కొనసాగుతున్న మంచిర్యాల ఎంప్లాయ్‌మెంట్ శాఖ రెగ్యులర్ అధికారి వెంకటరమణ జిల్లాలో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలున్నాయి. ప్రధానంగా అప్పుడప్పుడైనా సమావేశాలకు రాకపోవడం, గ్రీవెన్స్‌కు అటెండ్ కాకపోవడం నేపథ్యంలో కలెక్టర్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండే అధికారి కోసం దృష్టి సారించారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాలన్నీ సీడీపీవో మిల్కాకు అనుకూలిస్తున్నాయే ప్రచారం సాగుతుంది. ఇప్పటికే కలెక్టర్ ఆమె సర్వీసు సేవలను వినియోగించుకునే విషయంలో సంబంధిత శాఖ ఉపాధి శిక్షణ కమిషనరేట్‌కు నివేదించినట్లు తెలుస్తోంది. అక్కడ ఆమోదం లభిస్తే మిల్కా ఉపాధి కల్పన శాఖ అధికారిగా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని చెప్పుకుంటున్నారు.

మాతృ శాఖను ధిక్కరించినట్లేనా..?

మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి కొద్ది రోజుల క్రితం ఆదిలాబాద్ డీడబ్ల్యూవోగా సుభద్రను నియమిస్తూ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న మిల్కాను కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అయితే ఆమె ఆ శాఖ కమిషనరేట్‌లో రిపోర్టు చేశారా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. మరో పక్క మాతృ శాఖ నుంచి ఫారెన్ సర్వీస్‌కు వెళ్తున్నప్పుడు సొంత శాఖ కమిషనర్ నుంచి అనుమతి తీసుకోవాలని సీనియర్ అధికారులు చెబుతున్నారు. మరి ఆమె ఈ విషయంలో నిబంధనల మేరకు వెళ్తున్నారా.. లేని పక్షంలో ఇక్కడ పైరవీల ద్వారా ఆ పోస్టు కోసం నేరుగా ప్రయత్నాలు చేస్తున్నారా అని ఈ రెండు శాఖల్లో చర్చ సాగుతోంది.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- మండుటెండను సైతం లెక్కచేయని అర్జీదారులు
- దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్లు




అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, నటరాజ్

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణికి గాను ఈ సారి వినతులు వెల్లువెత్తాయి. బాధితులు మండుటెండను సైత లెక్క చేయకుండా భారీగా తరలివచ్చి తమ సమస్యలు విన్నవించుకున్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్లు రిజ్వాన్, నటరాజ్‌లు అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, జెడ్పీ సీఈవో గణపతి, డీఆర్డీవో కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన వారి మాటల్లోనే..

ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలి..

రైతులు యాసంగిలో పండించిన జొన్న పంటను ఆంక్షలు లేకుండా ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒక్కో రైతు నుంచి 5.16 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. గతేడాది ఎకరాకు 10.44 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సర్కారు ఈ ఏడాది తగ్గించడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈమేరకు అదనపు కలెక్టర్ స్పందిస్తూ వెంటనే ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులువెంకట్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింగ్ పాల్గొన్నారు.


దరఖాస్తులపై విచారణ జరుపలేదు



పట్టణంలోని 31వ వార్డు అంబేద్కర్‌నగర్, ఖానాపూర్ కాలనీకి సంబంధించి 102 మంది నిరుపేదల వివరాలతో కూడిన దరఖాస్తులను వార్డు ప్రత్యేకాధికారికి అందజేశాం. కానీ ఈ దరఖాస్తులపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఎలాంటి క్షేత్రస్థాయి విచారణ జరుపకుండానే లక్కీ డ్రా నిర్వహించారు. అర్హులైన పేదలకు అన్యాయం చేసిన అధికారులు సొంత ఇల్లు, వాహనం, భూమి కలిగిన 14 మందిని ఎంపిక చేశారు. దీనిపై తిరిగి విచారణ జరిపించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూడాలి.

– రషీద్, ఎంఐఎం నాయకుడు

విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదు..



మాది తలమడుగు మండలంలోని ఖోడద్ గ్రామం. దళితబ స్తీ పథకం కింద నాతో పాటు గ్రామానికి చెందిన మరో ఐదుగురికి ప్రభుత్వం మూడెకరాల చొప్పున భూమిని కేటాయించింది. అందులో బోర్లు సైతం వేశారు. ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదు. ఎ స్సీ కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చేస్తాం.. చూస్తాం అంటున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

–ఎంబడి పెద నర్సింలు, ఖోడద్, తలమడుగు

అర్హులకు అన్యాయం చేశారు..

మాది ఆదిలాబాద్ పట్టణంలోని చించర్‌వాడ. మేమంతా నిరుపేదలం. సొంతిళ్లు లేవు. డబుల్ బెడ్ రూం కోసం దరఖాస్తు చేసుకున్నాం. మాకే వస్తాయని ఆశపడ్డాం. కానీ అనర్హులైన వారికి ఇళ్లను కేటాయించిన అధికారులు మా లాంటి పేదలను విస్మరించారు. ఉన్నతాధికారులు మా పరిస్థితిని అర్థం చేసుకుని మలి విడతలోనైనా న్యాయం చేయాలి.

– చించర్‌వాడ మహిళలు, ఆదిలాబాద్



గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

- జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్
- సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

నార్నూర్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీపీ మోతుబాయితో కలిసి ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి మండల నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చి మండలానికి మంచి పేరు తీసుకు రావాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎంఈవో ఆశన్న, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఎంపీటీసీ విజయలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు షెక్ దస్తగీర్, ఎంపీవో స్వప్నశీల తదితరులున్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్‌లో పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లుఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు.మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, నాయకులు వెంకట్‌రెడ్డి,గోవర్ధన్ రెడ్డి, వేణు యాదవ్, చంద్రయ్య,సర్పంచ్ దేవన్న, ఎంపిడీవో గజానన్ రావ్, డీటీ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఎప్పుడో..?





"ఇక్కడ కనిపిస్తున్న రైతు మునిగెల శివయ్య. బోథ్ మండలం సొనాల గ్రామం. నాలుగేళ్ల క్రితం బ్యాంకు నుంచి రూ.లక్ష 50 వేల రుణం పొందాడు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) పార్టీ రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. మళ్లీ ఎన్నికలొస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయకపోవడంతో ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదని ఈయన పేర్కొంటున్నాడు. మరో వైపు ఏటా బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నాడు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.

- రైతులకు తప్పని నిరీక్షణ
- అమలుకు నోచని సర్కారు హామీ
- బడ్జెట్‌లో నిధులకే పరిమితం
- ఆచరణలో కనిపించని వైనం
- కొత్త రుణాలివ్వని బ్యాంకర్లు
- వడ్డీ చెల్లించాలంటూ అన్నదాతపై ఒత్తిడి

ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం 15.60 లక్షల ఎకరాలు
మొత్తం రైతుల సంఖ్య 5.50 లక్షలు
బ్యాంకురుణాలు పొందిన రైతులు 3.61 లక్షలు
ఇప్పటివరకు రుణమాఫీ అయిన వారు 1.19 లక్షలు
ఇంకా రుణమాఫీ కావాల్సిన వారు 1.42 లక్షలు

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ఎప్పుడు చేస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. 2018లో నాలుగు విడతల్లో రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తొలివిడతలో రూ.25 వేల లోపు రుణం, రెండో విడతలో రూ.39వేల వరకు ఉన్న వాటిని మాఫీ చేసింది. ఇందులో కూడా కొంతమందికి వర్తింపచేయలేదు. రూ.50వేలలోపు ఉన్నవారితో పాటు రూ.75వేలు, రూ.లక్ష రుణం తీసుకున్న రైతులకు సైతం మాఫీ చేస్తామని చెప్పినా ఇప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. రైతులు మాత్రం తమకు రుణమాఫీ ఎప్పుడు పూర్తవుతుందోనంటూ గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. బ్యాంకులు మాత్రం వడ్డీకి, వడ్డీ జమచేస్తూ తమపై రుణభారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్‌లో కేటాయిస్తున్నా.. రుణమాఫీ అమలు కావడం లేదు

2018 డిసెంబర్ నాటికి రూ.లక్షలోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో, శాసనసభ సాక్షిగా సీఎం కేసీఆర్ రెండుసార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అనుకున్నట్లుగానే గులాబీ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నిర్దేశిత గడువు లోపు రూ.లక్షలోపు ఉన్న రుణాల జాబితాను పంపించాలని ఆయా బ్యాంకులను ప్రభుత్వం ఆదేశించింది. వాటిని విడతల వారీగా మాఫీ చేస్తామని ప్రకటించింది. తొలుత రూ.25వేలు,తర్వాత రూ.50 వేలు, రూ.75వేలు, లక్షలోపు మాఫీ చేయనున్నట్లు సీఎం కేసీఆర్ అసెంబ్లీసాక్షిగా ప్రకటించారు. బడ్జెట్లోనూ ముడుసార్లు నిధులు కేటాయించినా ఇప్పటికీ రుణమాఫీ పూర్తి చేయకపోవటంతో ప్రతిపక్షాలతో పాటు రైతులనుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బడ్జెట్‌లోనూ రుణమాఫీ కోసం రూ. 6,385 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అయినా ఇప్పటికీ పురోగతి లేకపోవడం గమనార్హం.

పంట రుణాల కోసం తిప్పలు

జిల్లా వ్యాప్తంగా రైతులు సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం నానా తిప్పలు పడుతున్నారు. పంటలు అమ్మిన డబ్బులు కూడా సకాలంలో అందకపోవడంతో విత్తనాలు, ఎరువులు, దున్నడం, కూలీలకు అవసరమైన మొత్తానికి వారికి ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు రైతులకు అవసరమైన పంట రుణాలు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా బ్యాంకర్లు మాత్రం స్పందించడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

నాలుగేళ్లుగా ఎదురుచూపు..



సాగు కోసం బ్యాంకులో రూ.లక్షా 30 వేలు రుణం తీసుకున్నా. ప్రభుత్వం మాఫీ చేస్తుందనే ధీమాతో తిరిగి చెల్లించలేదు. నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా. ఇప్పుడు.. అప్పుడు అంటున్నరు తప్ప మాఫీ మాత్రం కావడం లేదు. మరోవైపు వడ్డీ ఎక్కువైతుందని బ్యాంకు వాళ్లు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరుతున్నాం. – ఎక్కిర్ల రవి, సొనాల

ఆదేశాలు రాలేదు..

రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే తదనుగుణంగా చర్యలు చేపడతాం.

– రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్

మున్సిపల్ కార్యాలయానికి ఎందుకొచ్చావ్..

- కౌన్సిలర్లు తప్ప ఇతరులెవరూ రావొద్దు..
- మున్సిపల్ వైస్‌చైర్మన్ బెదిరింపు
- బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిపై దురుసు ప్రవర్తన



బీజేపీ నాయకుడితో వాగ్వాదానికి దిగిన మున్సిపల్ వైస్ చైర్మన్

కైలాస్‌నగర్: పట్టణ ప్రజలు తమ సమస్యలను నివేదించుకోవాలంటే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సిందే. అలాంటి కార్యాలయానికి కౌన్సిలర్లు తప్పా ప్రజలెవరూ రావద్దంటూ ఆదిలాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ హుకుం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆదిలా బాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గండ్రత్ మహేందర్ సోమవారం పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయంలోన రెవెన్యూ విభాగానికి వెళ్లాడు. ఆయన్ను గమనించిన వైస్ చైర్మన్ జహీర్ రంజాని కార్యాలయానికి ఎందుకు వచ్చావని.. కౌన్సిలర్లు తప్పా మరెవరు రావద్దని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో అక్కడేమి జరుగుతుందో తెలియని పరిస్థితి. బిగ్గరగా అరుస్తూ మున్సిపల్ కార్యాలయంలో నీకేమి పని అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పని కోసం వచ్చానని సదరు నాయకుడు చెబుతున్నా వినకుండా కౌన్సిలర్లు తప్పా ఇతరులు ఎవరూ రావద్దంటూ అక్కడి సిబ్బందిని సైతం ఆదేశించడం గమనార్హం. కాగా పట్టణంలోని చిల్కూరిలక్ష్మీనగర్‌లో అక్రమంగా జరిగిన అసైన్మెంట్ల విషయాన్ని సదరు నాయకుడు సోషల్ మీడియాలో బహిర్గతం చేయడంతో పాటు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుందనే ప్రచారం సాగుతోంది. ఇదివరకు అధికారులపైనే దబాయింపు, బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్న వైస్ చైర్మన్ తాజాగా ఉద్యోగుల సమక్షంలో ఓ నాయకుడిపై ఇలా బెదిరింపులకు దిగుతూ హెచ్చరించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

క్లుప్తంగా

అండర్- 19 జట్టులో విష్ణుసాయితేజకి చోటు


విష్ణుసాయితేజ

నిర్మల్‌ఖైన్‌గేట్: నేషనల్ చాంపియన్ షిప్ టి–20 క్రికెట్ కప్ అండర్ 19 విభాగంలో తెలంగాణ జట్టులో ఆడేందుకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన బి.శ్రీనివాస్, నిర్మలజ్యోతి దంపతుల కుమారుడు బి.విష్ణుసాయితేజ ఎంపికయ్యాడు. ఈ నెల 17 నుంచి 19 వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగే మ్యాచ్‌లో ఆడనున్నారు. ఈ సందర్భంగా విష్ణు సాయితేజని పలువురు అభినందించారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పీవీటీజీ విద్యార్థుల కోసం హైదరాబాద్‌లోని హయాత్‌నగర్‌లోని జూనియర్ కళాశాలలో 2023- 24 విద్యాసంవత్సరానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీవో గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 40మంది చొప్పున ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఉచిత విద్య, వసతితో పాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, ఎంసెట్ కోచింగ్ సీఎంఏ, సీఎల్‌ఏటీ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలతో బాలుర కళాశాల హయత్‌నగర్ ప్రిన్సిపాల్ 9440398993, బాలికల కళాశాల హయాత్‌నగర్ ప్రిన్సిపాల్ నం. 9640853914కు వాట్సాప్‌ల్లో పంపించాలని తెలిపారు.

టేకు చెట్లు నరికిన నిందితుల రిమాండ్


నిందితులతో ఫారెస్ట్ సిబ్బంది

పెంబి: పెంబి రేంజ్, తాటిగూడ సెక్షన్, పులగంపాండ్రి పరిధిలోని పది రోజుల క్రితం బేస్ క్యాంపు సిబ్బంది సాయంతో గుండాల గ్రామానికి చెందిన తొమ్మిది మంది 22 టేకు చెట్లను నరికిన విషయం తెలిసిందే. బేస్ క్యాంపు సిబ్బందిలోని ఒకరు, చెట్టు నరికిన నలుగురిని నిర్మల్ కోర్టులో సోమవారం హాజరుపరిచారు. నిందితులకు 12రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్‌ఆర్‌వో రామకృష్ణ తెలిపారు. పరారీలోని మరో నలుగురు నిందితులను త్వరలోనే పట్టుకుని కోర్టులో హాజరు పర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంబి రేంజ్ సిబ్బంది ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడకు చెందిన గుర్లె చిన్నుబాయి(50) కొంతకాలంగా మద్యానికి బానిసైంది. సోమవారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



నేటి నుంచి దోస్త్

- డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్
- ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు
- మూడు విడతలుగా ప్రక్రియ
- జూలై 17 నుంచి తరగతులు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్/బోథ్: 2023-24 విద్యాసంవత్సరంలో డిగ్రీలో ప్రవేశానికి చేపట్టే (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) దోస్త్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. విద్యార్థులకు ఇష్టమైన కళాశాల, నచ్చిన కోర్సు ఎంచుకునేందుకు వీలు కల్పించారు. ప్రవేశ ప్రక్రియ మూడు విడతలుగా జరుగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత మండలి చైర్మన్, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ దోస్త్ నోటిఫికేషన్, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు ప్రకటించారు. మే 16 నుంచి జూన్ 10 వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్లు షురూ కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు 137 ఉన్నాయి. ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లాలో 6,470 మంది, మంచిర్యాల జిల్లాలో 4,656 మంది, నిర్మల్ జిల్లాలో 3,979 మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3,973 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒక్కో కళాశాలలో ఒక్కో కోర్సుకు 60 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఎం, కంప్యూటర్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈసారి రాష్ట్రంలోని 11 కళాశాలల్లో కొత్తగా బీఎస్సీ ఆనర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ పేరిట నాలుగేళ్ల కోర్సు ప్రారంభిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఏయే కళాశాలల్లో కొత్త కోర్సుకు అనుమతి ఉంటుందో దోస్త్ ప్రక్రియ ప్రారంభమైతేగానీ తెలియని పరిస్థితి.

ఇంట్లో నుంచే దరఖాస్తు

డిగ్రీలో ప్రవేశం పొందగోరే విద్యార్థి ఇంట్లో నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ అనుసంధానం చేసిన స్మార్ట్‌ఫోన్ ఉంటే దానితో నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలా కుదరనిపక్షంలో తల్లిదండ్రుల ఫోన్లకు విద్యార్థి తన ఆధార్‌ను అనుసంధానించి ప్రక్రియను కొనసాగించే అవకాశం కల్పించారు. ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉంటే విద్యార్థి ఇంట్లో కూర్చునే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. టీయాప్ ఫోలియో మొబైల్ యాప్ ద్వారా సులువుగా రిజిస్టర్ చేసుకునే సదుపాయం కల్పించారు. వివరాలు పూర్తి చేసిన తర్వాత విద్యార్థి సెల్‌ఫోన్‌కు ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) సమాచారం వస్తుంది.

సీట్లు భర్తీ అయ్యేనా?

గతేడాది ఐదు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించినా సగానికి పైగా సీట్లు భర్తీ కానీ గడ్డు పరిస్థితి. ప్రభుత్వ కళాశాలల్లో కాస్త మెరుగ్గా ఉన్నా ప్రైవేట్ కళాశాలల్లో సీట్లు మిగిలిపోవడం నిరాశ పరిచింది. నాలుగు ప్రభుత్వ కళాశాలల్లో 1,920 సీట్లకుగానూ 807 సీట్లు మిగిలిపోయాయి. జిల్లాలో డిగ్రీ ప్రవేశాల సంఖ్య తగ్గడానికి ఇంటర్ ఉత్తీర్ణత శాతం తగ్గిపోవడం కారణమైతే.. విద్యార్థులకు హైదరాబాద్ నగరంపై మోజు ఉండడం మరో కారణం. ఒకప్పుడు ఇంజినీరింగ్ విద్య కోసం రాష్ట్ర రాజధానిపై ఆసక్తి కనబర్చి బీటెక్ కోర్సులు అక్కడ చదవడం ప్రారంభించారు. మరోవైపు వసతితో కూడిన విద్య అమలు చేస్తుండడంతో గురుకులాల్లో కూడా డిగ్రీ ప్రవేశపెట్టడంతో కూడా కొంతమేర ప్రవేశాలు తగ్గినట్లు చెబుతున్నారు. ప్రైవేట్‌లో 40శాతం సీట్లు కూడా భర్తీకాని పరిస్థితి ఏర్పడింది. దోస్త్ వచ్చిన తర్వాత విద్యార్థులు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవడం చాలా తేలికైంది. మరోవైపు అవసరానికి మించి కోర్సులు.. సీట్లు ఉన్నాయి. ప్రధానంగా ప్రైవేట్‌లో అత్యధికంగా ఇలాంటివే. ఒకరిని చూసి మరొకరు అన్నట్లు సీట్లను పెంచుకుంటూ వచ్చారు. దీంతో సీట్లు భర్తీకాక డిగ్రీ కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారుతోంది. మంచిర్యాల జిల్లాలో 22 కళాశాలల్లో ఒకటి, రెండు మూసివేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

దరఖాస్తు విధానం

దోస్త్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో పదోతరగతి, ఇంటర్ మెమోలు, 1 నుంచి పదోతరగతి వరకు బోనఫైడ్, కండక్ట్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, ఆధార్ అనుసంధానం సెల్‌నంబర్, ఈ ఏడాది తీసుకున్న కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కళాశాలలు, కోర్సుల్లో ప్రవేశానికి నమోదు చేసుకోవడానికి మొదటి విడతలో రూ.200 చెల్లించాలి. క్రెడిట్, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, టీవ్యాలెట్ ద్వారా చెల్లించవచ్చు.

మూడు విడతలుగా...

మొదటి విడత ఈ నెల16 నుంచి జూన్ 10వరకు రిజిస్ట్రేషన్, ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు, జూన్ 16న సీట్ల కేటాయింపు, 16నుంచి 25 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం ఉంటుంది. రెండో విడత జూన్ 16 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్లు, 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. మూడో విడత జూలై 1నుంచి 5 వరకు రిజిస్ట్రేషన్, 1నుంచి 6వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు, 10న సీట్ల కేటాయింపు ఉంటుంది.

సాంకేతికతతో కేసుల పరిష్కారం

- టూటౌన్ సీఐ పురుషోత్తంచారి


బాధితురాలికి బ్యాగు అందిస్తున్న సీఐ పురుషోత్తంచారి

ఆదిలాబాద్‌టౌన్: సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను త్వరితగతి పరిష్కరిస్తున్నట్లు టూటౌన్ సీఐ పురుషోత్తంచారి అన్నారు. ఇంద్రవెల్లికి చెందిన గేడం లత ఈ నెల 14న హైదరాబాద్ నుంచి కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఆదిలాబాద్‌కు చేరుకుంది. రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్‌కు వచ్చిన ఆమె ఆటోలో తన బ్యాగును మరిచిపోయింది. ఈ విషయమై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ పురుషోత్తం, ఏఎస్సై సిరాజ్, బ్లూకోర్టు అధికారి రమణయ్య, రమేష్‌లు కలిసి సీసీ ఫుటేజ్ ఆధారంగా ఆటోను గుర్తించారు. ఆ బ్యాగును రికవరీ చేసి సోమవారం బాధితురాలికి సీఐ అందజేశారు. అందులో రూ.20వేల నగదు, పుస్తెల తాడు, చెవి గున్నలు ఉన్నాయి. తన బ్యాగును అందించిన పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. అదే విధంగా ఆదివారం ఉదయం పట్టణంలోని కరాచీ బేకరీ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులకు వెళ్లిన కానిస్టేబుల్ అందులో రూ.9వేలు ముందుగానే వచ్చినట్లు గుర్తించాడు. ఏటీఎం డబ్బులు డ్రా చేసిన వారు ఆధారాలు చూపిస్తే వారికి ఆ డబ్బులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఫిర్యాదులు ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. పోలీసులు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి


ఎస్పీకి స్వాగతం పలుకుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్: వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ఎస్పీకి ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐ సైదారావు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. సిబ్బంది మాట్లాడి నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సెంటర్ పరిశీలించి ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతీ ఒక్క ఫిర్యాదు దారుని పిటిషన్ వెంటనే నమోదు, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించినప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరగుతుందని తెలిపారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న సర్కిల్ కార్యాలయాన్ని, ఉట్నూర్ రెండవ ఎస్సై కార్యాలయాన్ని రనోవేషన్ చేసి పునఃప్రారంభించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఇందులో ఉట్నూర్ ఎస్సై భరత్ సుమన్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు అర్జీలు సమర్పించారు. కొలాంగూడకు చెందిన లలిత ఏఎన్‌ఎం ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం రాంపూర్ గ్రామస్తులు తమకు గిరి వికాసం పథకం కింద బోరుబావులు, విద్యుత్ మోటార్లను మంజూరు చేయాలని, లింగాపూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన పుర్క బాగుబాయి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా కోసం, ఎంద గ్రామానికి చెందిన రాజేశ్వర్ పాల వ్యాపారానికి, పలువురు వివిధ వాటికి దరఖాస్తులు అందజేశారు. అదనపు వైద్యాఆరోగ్య శాఖ అధికారి కుము రం బాలు, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

కోతిదాడిలో ఒకరికి గాయాలు

ఖానాపూర్: కోతిదాడిలో పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన దుర్గం లక్ష్మిపతిగౌడ్‌కు గాయాలైన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మూడు రోజుల క్రితం ఇంటి సమీపంలోని గల్లీలో కోతి దాడిలో గాయాలైన క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో తీవ్రనొప్పులతో బాధపడుతున్న లక్ష్మిపతిగౌడ్‌ను పరిశీలించిన వైద్యులు భుజం వద్ద ఎముక విరిగిందని తెలిపారు. జనావాసాల్లోకి ప్రతి రోజు వస్తున్న కోతులతో నానా ఇక్కట్లు పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు తీసిన రహదారులు

రోడ్డు ప్రమాదాలతో పలువురి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. పలువురు విగతజీవులుగా మారుతున్నారు. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని వేర్వేరు చోట్ల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. పలువురు తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఆగి ఉన్న లారీని బైక్‌తో ఢీకొని సర్పంచ్ మృతిచెందగా, ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో కూలీ మృత్యువాత పడ్డాడు. మరో ఐదుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ట్రాక్టర్ ఢీకొని మరో కూలీ ప్రాణాలొదిలాడు.

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి
- పలువురికి తీవ్ర గాయాలు
- ఇందులో పొన్నారి సర్పంచ్, మరో ఇద్దరు కూలీలు..

ఆటో, లారీ ఢీ.. ఒకరి మృతి


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు

తలమడుగు: అంతర్రాష్ట్ర రహదారిపై ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన తలమడుగు మండలంలోని కోడథ్ గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడిహత్నూర్ మండలంలోని శాంతపూర్ గ్రామానికి చెందిన హమాలీ కూలీలు దిపాక్, పరమేశ్వర్, గోపాల్, ప్రతాప్‌సింగ్, మాదవ్, సతీష్, బాబురావులు ఆటోలో తలమడుగు మండలంలోని కోడథ్ గ్రామానికి బయలుదేరారు. కోడథ్ గ్రామ సమీపంలో మహారాష్ట్ర నుంచి ఎదురుగా వచ్చి లారీ ఆటోను ఢీకొంది. ఆటోలని కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి బాబురావు (55) ఆస్పత్రిలో మృతిచెందాడు. పరమేశ్వర్, సతీశ్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని..


సోఫియాన్ మృతదేహం

మామడ: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన అబ్బు సోఫియాన్ (19) అతిక్‌కు చెందిన ట్రాక్టర్‌పై కూలీ పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సోఫియాన్‌ను పనులకు రావాలని అతిక్ అతడి ఇంటికి వద్దకు వెళ్లాడు. ఇరువురు కలిసి బైక్‌పై బయలుదేరారు. అతిక్‌కు చెందిన ఇసుక ట్రాక్టర్‌ను డ్రైవర్ సమీర్‌ను తీసుకుని తమ వెనక రావాలని చెప్పాడు. మామడ నుంచి రాయదారి వైపు వెళ్తుండగా డ్రైవర్ సమీర్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న సోఫియాన్ తలకు బలమైన గాయమై మృతి చెందాడు. అతిక్ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. సోఫియాన్ తల్లి రఫియాబేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఆగివున్న లారీని ఢీకొని పొన్నారి సర్పంచ్ దుర్మరణం


సంజీవ్‌రెడ్డి (ఫైల్)


సంజీవ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామాన్ని ఆదర్శంగా నిలిపిన ఆ గ్రామ సర్పంచ్ చింతలపెల్లి సంజీవ్‌రెడ్డి (71) సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టి) గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... సంజీవ్‌రెడ్డి బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు బైక్‌పై ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టి) సమీపంలోని ఓ గార్డెన్‌కు బయలుదేరాడు. బైపాస్ రోడ్డుపై వెళ్తున్న క్రమంలో రోడ్డుపై మరమ్మతుల కోసం నిలిపిఉన్న లారీని వెనక నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, నాయకులు పరిశీలించి సంతాపం తెలియజేశారు. అయితే గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన సంజీవ్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అంత్యక్రియలకు భారీగా ప్రజానీకం..

పొన్నారి గ్రామంలో నిర్వహించిన సర్పంచ్ అంత్యక్రియల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ నగేశ్, మాజీ పాడి పరిశ్రమ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్ని నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో సర్పంచ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

బాలికపై అత్యాచారానికి యత్నించిన ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5 గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన సంజయ్ బిశ్వాస్ విలేజ్ నెం.5లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఎదురింట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక అరవడంతో చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించిన సంజయ్ పరారయ్యాడు. ఈమేరకు బాలిక తల్లి బిషకా మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

భగీరథ నీరు వృథా..


ట్యాంకు పైనుంచి వృథాగా పోతున్న నీరు



ఉట్నూర్‌రూరల్: మండుటెండల్లో గిరిజన ప్రాంత ప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడుతుంటే.. మరో వైపు అధికారుల నిర్లక్ష్యంతో గంటల తరబడి నీళ్లు వృథాగా పోతున్న దృశ్యాలు ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో దర్శనమించాయి. మండల కేంద్రంలోని గుస్సాడీ గుట్టపై భగీరథ ట్యాంక్ నిండి పైనుంచి గంటల తరబడి నీళ్లు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఇలా కొనసాగుతూనే ఉంది.